క్లుప్తంగా

21న ఆర్యవైశ్య వివాహ పరిచయ వేదిక

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా అవోపా ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన ఉదయం 9 గంటలకు అమిస్తాపూర్‌లోగల వాసవీ గార్డెన్స్‌లో ఆర్యవైశ్య వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్ రాజయ్య, అధ్యక్షుడు కంది శ్రీనివాసులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం 9440690006, 9440454472, 9440981102, 9885224209 నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

వాసవీమాతకు పూజలు

దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి పూజలు నిర్వహించారు. అభిషేకం, ప్రత్యేక అలంకారణలో వాసవీమాతకు పూజలు చేసి మహామంగళ హారతి ఇచ్చారు. సాయంత్రం దేవాలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చన, లలితా పారాయణం చేశారు. అనంతరం వాసవీమాత పల్లకీసేవ చేపట్టారు.

శాకాంబరి దేవిగా కన్యకాపరమేశ్వరి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని కన్యాకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు శుక్రవారం శాకాంబరిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు.

పాఠశాలల తనిఖీ

దేవరకద్ర: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి దుంకుడు శ్రీనివాస్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులే అన్నిట్లో ముందుండే విధంగా వారిని తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు.

రేపు యన్మన్‌గండ్లలో మెగా వైద్యశిబిరం

నవాబుపేట: మండలంలోని యన్మన్‌గండ్లలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వివేకానంద విద్యానికేతన్ పూర్వ విద్యార్థుల బృందం తెలిపింది. యన్మన్‌గండ్ల సబ్‌సెంటర్‌లో చిన్న పిల్లలతో పాటు, దంతాలు, కంటి పరీక్షలు, స్త్రీవ్యాధుల నిపుణులు అందుబాటులో ఉండి పరీక్షలు చేస్తారని, అవసరమైన వారికి మందులు ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం స్థల పరిశీలన

మిడ్జిల్: మండలంలోని బోయిన్‌పల్లిలో 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు కావడంతో శుక్రవారం తహసీల్దార్ రాజునాయక్ గ్రామంలోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. త్వరలో కొలతలు వేసి హద్దులను ఏర్పాటు చేయాలని సర్వేయర్‌కు సూచించారు. తహసీల్దార్ వెంట ఆర్‌ఐ అంబిక, కార్యదర్శి శ్రీను, నాయకులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

మహబూబ్‌నగర్ రూరల్: సార్వత్రిక ఎన్నికల సమయంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పి, ఇప్పుడు కాలయాపన చేయడం తగదని, వర్గీకరణ కోసం కేంద్రంపై తిరుగుబాటు చేస్తామని ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం యాదగిరిగుట్టలో జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సుకు స్థానిక ఆర్‌అండ్‌బి అతిథిగృహం నుంచి వాహనాలలో నాయకులు తరలివెళ్లారు.

కాకర్లపహాడ్‌లో బోనాలు

నవాబుపేట: మండలంలోని కాకర్లపహాడ్‌లో శుక్రవారం ఆషాఢ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లమ్మతల్లికి బోనాలతో మహిళలు ఊరేగింపు నిర్వహించి గ్రామదేవతకు మొక్కులు చెల్లించాన్నారు. కార్యక్రమంలో గోపాల్, నర్సింహులు, కృష్ణయ్య, నరేందర్, మాధవులు, సంజీవరెడ్డి, నారాయణరెడ్డి, రాజు, బాలయ్య, మల్లేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహించొద్దు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉద్యోగులు విధులపై నిర్లక్ష్యం వహించొద్దని అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. అడిషనల్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం టీఎన్‌జీఓ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, కార్యదర్శి చంద్రనాయక్, శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణమోహన్, వెంకట్‌రాంరెడ్డి, మధుసుదన్, మహేశ్వర్‌రెడ్డి, దేవేందర్ పాల్గొన్నారు.

ధరణి సమస్యలు పరిష్కరించండి

జడ్చర్ల: పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలను పరిష్కరించే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ మోహన్‌రావు ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ధరణి సమస్యలపై సమీక్షించారు.

ఏజీపీకి సన్మానం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): అసిస్టెంట్ గవర్నమెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన కురుమయ్యను జిల్లా ఆరెకటిక సంఘం నాయకులు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో ఖాజారాంజి, మహేందర్, శివరాములు, యాదిలాల్, రమేష్ పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండొద్దు

- సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలి
- మున్సిపల్ అధికారుల సూచన



ఎనుగొండలోని ఓ పాత ఇంటిని పరిశీలించి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వివిధ వార్డుల్లో కొన్ని పాత ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో మున్సిపల్ అధికారులు ఆయా ప్రాంతాలకు వెళ్లి పరిశీలించి అక్కడి యజమానులకు తగు సూచనలు ఇస్తున్నారు. తాజాగా శుక్రవారం ఎర్రమన్నుగుట్ట (వార్డు నం.14) సమీపంలోని ఓ పాత ఇంట్లో నివసిస్తున్న లక్ష్మీదేవమ్మతో పాటు ఆమె కూతురును ఖాళీ చేయించారు. ఈ కుటుంబాన్ని వీరన్నపేట శివారు లోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సముదాయానికి తరలించారు. అలాగే పాత పాలమూరు (వార్డు నం.11) లోని మైసమ్మ దేవాలయం సమీపంలో ఓ పాత ఇంటిలో నివసిస్తున్న ముగ్గురిని ఎస్సీ కమ్యూనిటీ హాలుకు పంపించారు. ఇక ఎనుగొండ (వార్డు నం.2) లో, ఎస్సీవాడ (వార్డు నం.5) లో ఒక్కో ఇల్లు శిథిలావస్థలో ఉన్నట్లు గుర్తించారు. వీటిలో నివసిస్తున్న వారిని వెంటనే సమీపంలోని కమ్యూనిటీ హాలుకు తరలి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, ఆర్‌ఐ ఎన్.నర్సింహులు, బిల్ కలెక్టర్ అహ్మద్ షరీఫ్, వార్డు ఆఫీసర్లు మధు, చిన్నికృష్ణ, మెప్మా సీఓ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

బోధన పద్ధతులపై అవగాహన అవసరం

దేవరకద్ర: మారుతన్న విద్యా విధానాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బైకాని బాలుయాదవ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలను, విలీన విద్య భవితా కేంద్రాలను సందర్శించారు. ఉపాధ్యాయులందరూ ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానెల్ ద్వారా, అలాగే ఎల్‌ఎమ్‌ఎస్ ద్వారా అప్‌లోడ్ చేయబడిన పాఠ్యంశాల ఆధారంగా విద్యా బోధన చేయాలన్నారు. విద్యార్థులందరికి నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందేలా చూడాలన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం



బాధితులకు వంటసామగ్రి, బెడ్‌షీట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇటీవల స్థానిక టీడీగుట్ట 45వ వార్డులో ఇళ్లు కూలిపోయిన బాధితులకు వంటపాత్రలు, ప్లేట్లు, బెడ్‌షీట్లను జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అవసరమైన చోట రెడ్‌క్రాస్ ప్రత్యక్ష మవుతుందని, వారి సేవలను విలువకట్టలేమని అన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, డాక్టర్ సామ్యేల్, వినోద్ కుమార్, సాయిబాబా, రాములుయాదవ్, లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

జిల్లా కేంద్రం 37వ వార్డు నుంచి ఖలీద్, షకీల్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు వినోద్‌కుమార్, సిరాజ్‌ఖాద్రీ, సాయిబాబా, రాములుయాదవ్, లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి



గండేడ్: టీబీ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం వెన్నాచేడ్‌లో టీబీ క్యాంపు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో టీబీ సోకకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పొగతాగరాదని, చిన్నపాటి దగ్గు వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. శిబిరంలో 140 మందికి ఎక్స్‌రేలు తీశారు. 30 మందికి తెమడ పరీక్షలు నిర్వహించారు. సీహెచ్‌ఓ రాములు, డాక్టర్ అనిత, లూయిస్, అంబదాస్, పుష్పవేణి, బాల్‌రాజ్, సత్యనారాయణ, గోపాల్, సుగుణ పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తగా ఉండాలి

నవాబుపేట: రుణమాఫీ విషయంతో రైతుల ఫోన్లకు రకరకాల మెసేజ్‌లు, డాటా లింక్‌లు వస్తాయని వాటిని పొరపాటున కూడా ఓపెన్ చేయకూడదని ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. ఈ విషయంలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ రైతు రుణమాఫీ రోజే మండలానికి చెందిన ఒక వ్యక్తి ఖాతా నుంచి లింక్ ఓపెన్ చేయగానే రూ.2లక్షలు స్వాహా కావటంపై ఆయన స్పందించారు. ఈ విషయంలో సైబర్ క్రైం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిందన్నారు. పొరపాటున ఖాతాల నుంచి డబ్బులు మాయం అయితే వెంటనే సైబర్ క్రైం 1930కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఆయన వివరించారు.

అంగన్‌వాడీలతో చిన్నారులకు మేలు



క్రిస్టియన్‌కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీటీచర్లు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్‌కాలనీలో శుక్రవారం అమ్మమాట, అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మోనప్పగుట్ట–3, క్రిస్టియన్‌కాలనీ టీచర్లు స్వచ్ఛ అంగన్‌వాడీపై ర్యాలీ నిర్వహించారు. పలువురు అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ రెండేళ్లు నిండిన పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లకు కాకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ కౌన్సిలర్ సీజే బెనహర్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను అన్ని విధాలుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. రెండేళ్లు నిండిన చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని, తద్వారా వారికి పౌష్టికాహారంతోపాటు మెరుగైన విద్య అందుతుందన్నారు. ఈ అవకాశాన్ని చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ దేవమ్మ, ఆర్పీ దివ్య, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, చంద్రకళ, కళారంజని, సువర్ణ, లలిత తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: అంగన్‌వాడీలకు పిల్లలను పంపించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసీమ్ సుల్తానా అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని మార్కెట్ రోడ్ ఏరియా, బండ్లగేరి సెక్టార్ పరిధిలో అమ్మమాట– అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు.

పెద్దర్పల్లిలో పారిశుద్ధ్య పనులు

హన్వాడ: మండలంలోని పెద్దర్పల్లిలో శుక్రవారం స్వచ్ఛభారత్, స్వచ్ఛాగావ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల గుండా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని ఆరోగ్య పద్ధతులు పాటించాలని వివరించారు. కార్యక్రమంలో చెన్నయ్యగౌడ్, రాధాకృష్ణగౌడ్, తేజ, బాలప్ప, నరేష్‌గౌడ్, ఫీల్డ్‌అసిస్టెంట్ వెంకటేష్ పాల్గొన్నారు.

పీయూ సమస్యలపై పోస్టర్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏబీవీపీ నాయకులు శుక్రవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ కోర్సులను సెల్ఫ్ ఫైనాన్స్ నుంచి రెగ్యులర్‌గా మార్చాలని, కోర్సు ఫీజులు, పరీక్ష ఫీజులను తగ్గించాలన్నారు. ఈనెల 23న పెద్దఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్జున్, కృష్ణకుమార్, శివ, జైపాల్, నగేష్, శ్రీను, వేణు పాల్గొన్నారు.

నాయకుల ముందస్తు అరెస్టు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పలు విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు శుక్రవారం ఉదయం ముందస్తు అరెస్టులు చేశారు. హైదరాబాద్‌లో నిరుద్యోగ సంఘాలు నిరసన చేపడుతున్న నేపథ్యంలో అరెస్టు చేసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. భరత్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీస్ రాజ్యం నడుస్తుందని వెంటనే ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెలవేర్చాలని, గ్రూప్స్‌లో పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో జేఏసీ చైర్మన్ రాము, కృష్ణకుమార్, తిమ్మప్ప, రూప్‌సింగ్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంపై ప్రశంస

నవాబుపేట: అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ బావుందని జెడ్పీ సీఈఓ రాఘవేందర్‌రావు అభినందించారు. శుక్రవారం మండలంలోని యన్మన్‌గండ్ల అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. భవనంపై గీసిన బొమ్మలు చిన్నారులను ఆకట్టుకునేలా ఉన్నాయన్నారు.

పర్యావరణాన్ని కాపాడే బాధ్యత అందరిది



జిల్లా కేంద్రంలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ అశోక్‌యాదవ్ అన్నారు. శుక్రవారం స్థానిక క్లబ్ కార్యాలయంలో మొక్కలు నాటారు. మొక్కలను పెంచడం వల్ల వాతావరణ సమతుల్యత ఉంటుందని, దీంతో వానలు సకాలంలో పడుతాయన్నారు. చెట్లను నరకడం వల్ల వాతావరణంలో వేడి పెరిగి జీవరాశి మనుగడకు ఉండదన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి సుదర్శన్‌యాదవ్, కోశాధికారి బుచ్చిబాబు, చంద్రకాంత్‌రెడ్డి, రఘు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధికారులు

దేవరకద్ర: మండల కేంద్రంలో శుక్రవారం రాయచూర్ రోడ్‌లోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో అధికారులు మొక్కలను నాటి నీరు పోశారు. విద్యార్థులు ప్రత్యేకంగా మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో ఈఓ సీత్యానాయక్, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి

స్టేషన్ మహబూబ్‌నగర్: అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆర్గనైజేషన్ ఫౌండర్, అధ్యక్షురాలు ఎస్.సరోజనమ్మ తెలిపారు. వచ్చేనెల 10న జరిగే కార్యక్రమానికి రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌కు ఆహ్వానపత్రం అందజేశారు. అవార్డుల దరఖాస్తులకు సంబంధించి 6302908528 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

'మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం'

జడ్చర్ల: తమది మాటలు చెప్పి.. గారడి చేసే ప్రభుత్వం కాదని ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే ప్రభుత్వమని మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నామన్నారు. ఇప్పటికే బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం, ఉచిత విద్యుత్, సబ్సిడీపై వంట గ్యాస్ సిలిండర్ అమలు చేశామని తెలిపారు. రూ.2లక్షల రుణమాఫీ చేసి సీఎం రేవంత్‌రెడ్డి రికార్డు సృష్టించారని కొనియాడారు.

పాస్‌బుక్ ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలి



భూత్పూర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: పట్టాదారు పాసు పుస్తకం ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసాను నిలిపివేస్తూ ఆ నిధులను రుణమాఫీకి ఆంక్షలు విధిస్తూ వినియోగిస్తున్నారని ఆరోపించారు. రుణమాఫీ విషయంలో జీవోలు ఒక మాదిరిగాను, సీఎం రేవంత్‌రెడ్డి మాటలు మరోలా ఉన్నాయని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 39లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అయితే రైతుభరోసా నిధులు వెంటనే ఖాతాల్లో జమ చేయాలని, ఆగస్టు 15లోపు ఆరు గ్యారంటీలు, 13 హామీలు అమలు చేయాలన్నారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ గౌడ్, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, నర్సింహులు గౌడ్, మురళీధర్‌గౌడ్, మన్యానాయక్, సాయిలు, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌పార్టీదే

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలో రైతులకు రుణమాఫీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, దేశ రాజకీయాల్లో చారిత్రాత్మకమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ మాట్లాడుతూ రైతు రుణమాఫీ సందర్భంగా ప్రతి నియోజకవర్గంలో ఆదివారం వరకు సంబరాలు చేస్తున్నట్లు తెలిపారు. శనివారం ప్రతి గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలు రుణమాఫీ పొందిన రైతులతో కలిసి ప్రభుత్వం సుభిక్షంగా ఉండాలని కోరుతూ దేవాలయాల్లో పూజలు చేయాలని కోరారు. సమావేశంలో లక్ష్మణ్‌యాదవ్, మల్లు నర్సింహారెడ్డి, మహేందర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: మహారాష్ట్ర కొల్హాపూర్ జిల్లా విశాల్‌ఘర్‌లోగల మసీద్‌పై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని ముస్లిం సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆల్ పార్టీ ముస్లిం లీడర్స్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. జుమా నమాజ్ అనంతరం వివిధ మసీదుల నుంచి ముస్లింలు స్థానిక తెలంగాణచౌరస్తాకు చేరుకుని నిరసన చేపట్టారు. మహారాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ మోసీన్‌ఖాన్, నాయకులు మాట్లాడుతూ మసీద్‌పై కొంతమంది దాడి చేసి అక్కడి ముస్లిం నివాసితులపై తీవ్రంగా హింసించడం సరికాదన్నారు. దేశంలో ప్రార్థనా స్థలాలపై, ముస్లింలపై దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు మనోభావాలను దెబ్బతీయడమే కాకుండా అభద్రతాభావానికి గురిచేస్తున్నాయని అన్నారు. అనంతరం రాష్ట్రపతికి రాసిన వినతిపత్రాన్ని స్థానిక ఐడీఓసీ బిల్డింగ్‌లో కలెక్టర్‌కు అందజేశారు. మోసీన్‌ఖాన్, అబ్దుల్ హాదీ, అన్వర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల నిరసన

అడ్డాకుల: మూసాపేట మండలం దాసర్‌పల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు రవివర్ధన్ సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీపై పెట్టిన పోస్టులు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల పరస్పర ఆరోపణలకు వేదికైంది. ఇటీవల రవివర్ధన్ కాంగ్రెస్ నాయకులపై సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టాడన్న ఫిర్యాదుతో శుక్రవారం పోలీసులు ఆయనను స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించారు. సమాచారం అందుకున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు లక్ష్మీనర్సింహయాదవ్, మాజీ జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మదీనా జమీర్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు స్టేషన్ వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. తమ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పోలీసులు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా స్టేషన్‌కు ఎలా తీసుకొస్తారని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా విచారణ తర్వాత పోలీసులు రవిని ఇంటికి పంపించారు. నిరసనలో కొండయ్య, దాసర్‌పల్లి రాజు, భాస్కర్‌గౌడ్, రవీందర్‌గౌడ్ ఉన్నారు.

నీటి నిల్వలను ఉంచరాదు

దేవరకద్ర: ముసురు వర్షాలు కురుస్తుండడంతో ఎక్కడ కూడా నీటి నిల్వలు కనిపించరాదని, దీంతో దోమలు పెరిగి డెంగీ, మలేరియా పలు అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఈఓ సీత్యానాయక్ సూచించారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ఇంటింటికీ తిరిగి నీటి నిల్వలను పారబోశారు. అలాగే మురికిగా ఉండే ప్రదేశాలలో మందులను పిచికారి చేశారు. దోమలు పెరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సూచించారు.

ఎన్‌సీసీ కంపెనీని పరిశీలించిన కమాండెంట్

జడ్చర్ల టౌన్: స్థానిక డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ–37 కంపెనీని హైదరాబాద్ గ్రూప్ కమాండ్ కల్నల్ అనిల్ కుమార్, 8వ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ అధికారి ఎస్.కే సింగ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. క్రమ శిక్షణగల సైనికులుగా, దేశభక్తులుగా ఎదిగి సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అప్పియా చిన్నమ్మ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లో డ్రై డే కార్యక్రమం



పాలకొండలో డ్రమ్ముతో పాటు సంప్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణ పరిధిలోని 49 వార్డుల్లో శుక్రవారం 'డ్రై' డే నిర్వహించారు. ఇందులో భాగంగా వార్డు ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు, పారిశుద్ధ్య కార్మికులు, మున్సిపల్ సిబ్బంది విస్తృతంగా ఇంటింటికీ తిరిగి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. నీటి సంప్‌లు, డ్రమ్ములలో ఎక్కువ రోజులు నీటి నిల్వ చేయొద్దని సూచించారు. దోమల నివారణకు పలు చోట్ల రసాయనాలు చల్లడమేగాక ఫాగింగ్ చేశారు. ఆయా వీధుల్లోని మోరీలు శుభ్రపరిచి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఓపెన్ ప్లాట్లు, బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం తొలగించారు. ఈ కార్యక్రమాన్ని పలుచోట్ల మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పర్యవేక్షించారు. ఇక 35వ వార్డులో కౌన్సిలర్ జాజిమొగ్గ నర్సింహులు, 41వ వార్డులో కౌన్సిలర్ రహియాబేగం పాల్గొన్నారు.